
శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ - కథాకేళి నిర్వహించిన దీపావళి కథల పోటీలో

ప్రథమ బహుమతి పొందిన కథానిక

# మోడల్



అభిసారిక.

ప్రియుడి రాక కోసం తనువంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తోన్న పద్దెనిమిదేళ్ళ పడుచు.

ఆమె కళ్ళలో ఆత్రుత, ఉత్కంఠ, అనురాగజలధి – ముప్పేటగా పోటీపడుతున్నాయి.

రూపుదాల్చిన యౌవనం ఆమె. వెన్నెలలాంటి సౌందర్యం ఆమెది. ఉత్కంఠ భరిత నిరీక్షణ ఆమెది!

ఆమె ఓ మత్తు. ఓ మైమరపు. అక్షరాల్లో ఇమడలేని ఓ కవిత. బాహువులు పట్టని ఓ చిరుజలపాతం !

పొడుగాటి మొహం, ఒత్తి దువ్విన జుట్టు, నుదుట చిన్న బొట్టు, గడ్డం ముందు భాగాన అయిదు నల్లని బొట్లు, మెడలోనూ చెవికీ పెద్ద పెద్ద వెండి ఆభరణాలు, ముక్కుకి రెండు వైపులా చిన్న పుడకలు, అద్దాలు కుట్టిన రంగు రంగుల దుస్తులు, ముంజేతి నుండి మోచేతి వరకూ తెల్లని దంతపు గాజులు, తల మీద కప్పుకున్న నీలిరంగు అంచు గల ఎర్రని పావడా.

ఓ లంబాడీ యువతి ఎదురు చూపులకు నిలువెత్తు చిత్రం!

చిత్రంలో జీవకళ ఉట్టిపడుతోంది. ప్రతి అవయవంలోనూ ఆమె 'ఎదురు చూపు' ప్రస్ఫుటమవుతోంది. ముఖ్యంగా మొహం వికసించి ఉద్వేగ భరితమై ప్రియుడి స్పర్శకోసం తహతహలాడుతోన్నట్టు అన్పిస్తోంది. ఇక కళ్ళలోంచి ఒలుకుతోన్న భావాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

ఆ చిత్తరువు నా సృష్టి!

చిత్రకారుడిగా నన్ను పై మెట్టుకి ఎక్కించడమేగాక ఖ్యాతినీ కాసుల్నీ అందించిన తొలినాళ్ళ చిత్రం యొక్క ఫోటో.

నా ఇంటి హాలులో అమర్చిన ఆ వర్ణ చిత్రం వంక అబ్బురంగా అపురూపంగా చూస్తుండిపోయాను. చూసిన ప్రతిసారీ కొత్త భావాలు స్ఫురిస్తాయి. క్రొంగొత్త అనుభూతులు చుట్టేస్తాయి. ఈ నాటికీ ఈ 'నకలు' మెస్మరైజ్ చేస్తోంది. ఇక న్యూయార్క్ ఆర్ట్ గ్యాలరీలో ఉన్న ఒరిజినల్ చిత్రాన్ని చూసిన వాళ్ళెంతగా ముగ్ధులవుతున్నారో!

నాకొచ్చిన కీర్తికీ అవార్డులకీ మూలాలు ఇదిగో ఈ చిత్రంలోనే ఉన్నాయి. అందువల్లే నా మనసుకి బాగా దగ్గరైందీ కళాఖండం.

ఈ ఫోటోని అమ్మమని ఎందరో అడిగారు. గొప్ప ఆఫర్లిచ్చారు. నేను మెత్తబడలేదు. మరిన్ని నకళ్ళు గీసివ్వడానికీ అంగీకరించలేదు.

సుమారు ముప్పై ఏళ్ళ క్రితం ఆర్ట్స్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక తపస్సుగా భావించి గీసిన చిత్రం ఇది. ఇవాళ నేను ప్రపంచ ఖ్యాతి గాంచిన చిత్రకారుడ్ని కావొచ్చు. కాని నా మొదటి అడుగు... నా వేరు... ఇదిగో ఈ చిత్రంలోనే ఉంది! ఒక రకంగా నా చిత్రకళా ప్రస్థానం ఈ చిత్రంతోనే మొదలైంది!

"ఫెంటాస్టిక్ మిస్టర్ మూర్తీ. ఇట్స్ రియల్లీ గ్రేట్. ఎ విజువల్ ట్రీట్!" జేమ్స్ అన్నాడా చిత్రం చూసి.

'చిత్రరంగంలో నూతన ధోరణులు' – అన్న అంశం మీద ఢిల్లీలో మా యూనివర్శిటీ తరపున ఓ సెమినార్ ఏర్పాటు చేశాం. అందులో పాల్గొనడానికి లండన్ నుంచి వచ్చాడతడు. మాకు పూర్వపరిచయం ఉండటంతో మా ఇంటికి డిన్నర్‌కి ఆహ్వానించాను.

మందహాసం చేశాను. ఇంటికొచ్చిన ప్రతి వారినీ ఆకర్షించి అభినందింపజేస్తుందా చిత్రరాజం.

"హూ ఈజ్ దట్ మోడల్?" తనూ ప్రఖ్యాత చిత్రకారుడే అవడం వల్ల కాబోలు ఉత్సుకతతో అడిగాడు జేమ్స్.

"సమ్ లంబాడీ లేడీ......"

"వాట్స్ హర్ నేమ్?"

పెదవి విరిచాను గుర్తు లేదన్నట్టు. నిజంగానే నాకు గుర్తులేదు.

"హెర్ ఎక్స్‌ప్రెషన్స్ ఆర్ టెర్రిబుల్......"

"యా..... ప్లీజ్ బీ సీటెడ్......"

అతడొచ్చి సోఫాలో కూర్చున్నాడు. కాని ఆ చిత్రాన్నీ దానికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన మోడల్నీ వదల్లేదు. ప్రశ్న మీద ప్రశ్న సంధించాడు.

మరి తప్పక ఆమెనీ అప్పటి రోజుల్నీ గుర్తు తెచ్చుకున్నాను.

హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో నేను చిత్రకళని అభ్యసిస్తున్న రోజులు.

ఆ కళాశాలలోని చిత్రకారులకూ శిల్పకారులకూ ఓ లంబాడీ యువతి మోడల్‌గా పని చేసేది. దానినే వృత్తిగా చేసుకుని కళాశాలని అంటిపెట్టుకుని ఉండేది. నాలుగేళ్ల చిత్రకళ, శిల్పకళ కోర్సు పూర్తి చేయడానికి మోడల్‌గా కీలకపాత్ర పోషించేది.

ఆమె అందంగా ఉండేది. అడవి మల్లెలా ఉండేది. అంతేకాదు. ఎన్ని గంటలైనా సరే కదలక మెదలక శిల్పంలా కూర్చునేది. ఒక రకంగా బొమ్మయ్యేది. చిత్రకారుడి ఏకాగ్రత చెదరనిచ్చేది కాదు. అంత నిశ్చలంగా వుండేవారిని ఇంతవరకూ నేను చూళ్లేదు.

అసలామె అలా వుండి సహకరించటం వల్లనే ఎందరో ఔత్సాహిక చిత్రకారులు ప్రముఖ చిత్రకారులుగా రూపుదిద్దుకున్నారంటే అతిశయోక్తి కాదు.

ఆమెలో వున్న మరో సుగుణం ఎలా కావాలంటే అలా ఫోజిచ్చేది. కావాల్సిన భావాలు పలికించేది. వస్త్రధారణలోనూ మార్పు చేర్పులు చేసేది. పాఠ్యాంశంలోని విషయాల ఆధారంగా సెమి న్యూడ్ చిత్రాలు గీయడానికి సైతం అంగీకరించేది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె ఓ ముడిసరుకు. దాన్నెందరు ఎన్ని రకాలుగా మార్చి రంగుల్లో రాళ్ళల్లో బంధించారో లెక్కలేదు.

ఫైనలియర్లో 'అభిసారిక' చిత్రం గీసాను. అది గీయడానికి దాదాపు ఆరుగంటలు పట్టింది. అంతసేపు ఆమె ఒక చిత్తరువులానే కూర్చుంది. సరైన భావం రావడానికి ఆమె తలనీ మోమునీ చేతుల్నీ ఎన్నోసార్లు తాకాను. అవసరాన్ని మించి ఆమె వక్షపు వస్త్రాన్ని సర్దాను. యౌవనపు కోరికల్ని అదుపు చేసుకోలేక ఆమె వక్షాన్నీ తాకాను.

ఆమె ఏమీ అనలేదు. కోప్పడలేదు. నిర్వికారంగా చూస్తూండిపోయిందంతే. అది నా కోరకల మంటలకు ఆజ్యం పోసింది.

చిత్రం పూర్తయ్యాక ఆమె యౌవన శోభని చూస్తూ వుండలేక తమకంతో ఊగిపోతూ ఆమె చేతులు పట్టుకుని నా మీదకు లాక్కుని గాఢంగా కౌగిలించుకోబోయాను.

ఆమె మృదువుగా నన్ను విడిపించుకుని మెల్లగా నడచుకుంటూ వెళ్ళిపోయింది.

"వందిస్తాను..." బిగ్గరగా అరిచాను.

వెనుదిరిగి చూడలేదు.

పెదవి కొరుక్కుని ఓ బూతు తిట్టాను.

మోడల్‌గా వ్యవహరించినందుకు ఆమె కూలి అయిదు రూపాయలు నేనివ్వలేదు. ఆమె అడగలేదు.

నా కోర్కు పూర్తవడంతో తర్వాతామెని కలవనూ లేదు.

చిత్రకారుడిగా నా కెరీర్ ప్రారంభించాను. అనతికాలంలోనే పుంజుకున్నాను. మంచి గుర్తింపు వచ్చింది. ప్రశంసలు లభించాయి. ఢిల్లీ యూనివర్శిటీలో అధ్యాపకుడ్నయ్యాను. ఎందరో శిష్యులకు పాఠాలు బోధిస్తూ చిత్రరంగంలో విశేషకృషి చేస్తూ ఢిల్లీలోనే సెటిలయ్యాను.

దేశం గర్వించే ఆర్టిస్టునయ్యాను. 'పద్మశ్రీ' సైతం వరించింది.

ఆర్ట్ గ్యాలరీల్లో ఎగ్జిబిషన్లలో నా చిత్రాలు అత్యధిక ధరకు అమ్ముడవటం అంతర్జాతీయ సెమినార్లలో ఎగ్జిబిషన్లలో పాల్గొనడం......!

నేనింత ఎత్తుకి ఎదగడానికి మూలకారణం నిస్సందేహంగా ఆమే. ఎందరో మోడళ్ళతో పనిచేశానుగాని ఆమెలోని అంకిత భావం, దీక్ష సహకారం మరెవర్లోనూ మచ్చుకి కూడా కన్పించలేదు!

"వై యూ హేవ్ నాట్ యూజ్డ్ దట్ మోడల్ ఎగైన్"

జేమ్స్ ప్రశ్నకి తుళ్లిపడ్డాను.

నిజమే. 'అభిసారిక' తర్వాత ఆ లంబాడీ వనితతో మళ్ళీ చిత్రం గీయలేదు. ఎందుకో ఆమెని మళ్ళీ కలవాలన్పించలేదు.

నేనెంతో ఉన్నతస్థాయికి చేరుకున్నందువల్లనా? లేక ఒక రకమైన గిల్టీ ఫీలింగు వల్లనా? చెప్పలేను.

కాని ఒక్కటి మాత్రం నిజం. 'అభిసారిక' చిత్రం ప్రతిరోజూ ఆమెని గుర్తుకు తెస్తూంటుంది. ఆమెకి కూలి ఇవ్వని సంగతీ జ్ఞప్తికొస్తూంటుంది. చిత్రంగా ఆమె పేరు మాత్రం గుర్తురాదు!

నా ప్రతిభకన్నా మోడలే గొప్పదైనట్టు జేమ్స్ మాట్లాడుతోంటే నా మొహం జేవురించింది. అసహనంగా చూసాను.

అతడంతటితో ఆగలేదు. ఆమెతో మరిన్ని చిత్రాలు గీచి వుంటే శిఖరాగ్రానికి చేరేవాడివంటూ చెప్పుకొచ్చాడు.

'నువ్వెక్కడో పిచ్చోడివి' అన్నట్టు చూసి నవ్వేను.

"మోడల్ అంటే ఓ ముడిపదార్థం. ఓ బండరాయి. దాన్నుంచి అద్భుత చిత్రమో శిల్పమో సృష్టించే అత్యద్భుత ప్రతిభావంతుడు ఆర్టిస్టు. అందుచేత ఆ ఘనతంతా సృష్టికర్త అయిన మనకే దక్కుతుంది"

తల అడ్డంగా ఊపాడు జేమ్స్.

మనం గాలిలోంచేమీ సృష్టించలేమనీ మనకో ప్రేరణ ఆధారం స్ఫూర్తి ఉండి తీరాల్సిందేననీ వాదించాడు జేమ్స్.

సంభాషణని మళ్ళించడానికి వైన్, గ్లాసులు బయటికి తీసాను.

నా మస్తిష్కపు లోతుల్లో మాత్రం అతడు చెప్పింది నిజమేనేమో అన్పించసాగింది!

"గివ్ హెర్ ఎడ్రస్" ఉన్నట్టుండి అడిగాడు జేమ్స్.

నుదురు చిట్లించాను "దట్ మోడల్?"

"యాఁ. ఐ విష్ టు పెయింట్ ఎ స్లీపింగ్ బ్యూటీ విత్ హెర్ యాజ్ మోడల్"

బిగ్గరగా నవ్వబోయి కంట్రోలు చేసుకుంటూ "స్లీపింగ్ ఫోజ్?" అన్నాను.

"రైట్. హౌ షీ లుక్స్ వైల్ స్లీపింగ్. ఈజిట్ నాట్ ఎమేజింగ్ ఐడియా?"

"అఫ్‌కోర్స్......బట్ సారీ జేమ్స్...... ఐ మెట్ హెర్ లాంగ్ బ్యాక్. ఐడోంట్ నో హెర్ ప్రెజంట్ ఎడ్రస్......"

"ఐ హోప్ ఉయ్ కెన్ ట్రై విత్ ది హెల్ప్ ఆఫ్ యువర్ ఫ్రెండ్స్......"

పెదవి విరిచాను. "షీ లివ్స్ ఇన్ హైదరాబాద్. నాట్ హియర్ ఇన్ ఢిల్లీ"

"బ్యాడ్‌లక్!" గొణిగాడు.

సెమినార్ ముగియగానే జేమ్స్ లండన్ వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు ఎయిర్‌పోర్టులో ఆ మోడల్ చిరునామా తెలుసుకోమని మరోసారి అర్థించాడు.

అతడ్నంతగా ఆకర్షించిందంటే నిజంగానే ఆమెలో ఏదో ప్రత్యేకత ఉందన్నమాట.

నేను కూడా ఆమెని మోడల్‌గా పెట్టి మరో రెండు మూడు చిత్రాలెందుకు గీయకూడదు? ఇప్పుడు ముసలిదై వుంటుంది గనుక ఇంకో రకం చిత్రాలు చిత్రిస్తే - ఏమో మాస్టర్ పీసెస్ అవుతాయేమో!

నా మెదడులో చిన్న బీజం పడింది. మరి రెండ్రోజులకే మొలకెత్తి మారాకు తొడిగింది!

అనుకోకుండా హైదరాబాద్ ప్రయాణం తగిలింది. ప్రిన్సిపాల్ని నేనే వెళ్ళక్కర్లేదు. ఎవర్ని పంపినా సరిపోతుంది. కాని 'ఆమె'ని కలవ్వొచ్చన్న ఒకే ఒక కారణంతో నేనే ప్రయాణమయ్యాను.

నా పని పూర్తవగానే తిన్నగా మాసబ్ టాంక్‌లోని నేను చదివిన ఫైనార్ట్స్ కాలేజీకెళ్ళాను.

ప్రిన్సిపాల్ తదితరులు ఎదురొచ్చి మరీ స్వాగతం పలికారు. నన్ను వీఐపీగా ట్రీట్ చేశారు. ఆర్ట్స్ విద్యార్థుల సమావేశంలోనూ ప్రసంగించక తప్పలేదు.

పిమ్మట ప్రిన్సిపాల్ రూంలో టీ త్రాగుతూ 'ఆమె' గురించడిగాను. ఆయన ఉపాధ్యాయుల్ని పిలిచారు.

"ఒక లంబాడీ మహిళే ఎప్పట్నుంచో మా కాలేజీలో మోడల్‌గా పనిచేస్తోంది. మరి మీరు చెప్పే ఆవిడా ఈవిడా ఒకరో కాదో తెలీదు....."

వెంటనే పర్సులోని 'అభిసారిక' ఫోటో చూపించాను.

"నో డౌట్ ఈవిడే. కానిప్పుడిలా అందంగా లేదు. ముసలిదైపోయింది. అయినా స్టూడెంట్స్‌కి మోడల్‌గా ఉంటోంది....."

నాకు చాలా సంతోషం కలిగింది. "ఆమెని కలవాలి" అన్నాను ఉద్వేగాన్ని అణచుకుంటూ.

"మన మోడల్ని పిలు" ప్యూన్ని పిలిచి చెప్పారు ప్రిన్సిపాల్.

"అయితే గత 30 - 35 ఏళ్ళ నుంచీ ఇక్కడే మోడల్‌గా పనిచేస్తోందన్న మాట. చాలా ఓపిగ్గా కదలక మెదలక కూర్చుంటుందిలే. గుడ్ మోడల్. సర్వీసులోకి తీసుకున్నారా?"

"అహ లేదు. కాంట్రాక్టూ లేదు. డైలీ లేబర్లా రోజూ కాలేజీకొస్తుంది. అన్ని క్లాసులకూ వెళ్ళి 'నాకు పనుందా?' అనడుగుతుంది. విద్యార్థులకు అవసరమైతే మోడల్‌గా ఉంటుంది. వాళ్ళు గీస్తేనే ఆమెకి డబ్బులొస్తాయి. లేకపోతే పాపం పస్తే"

"మా టైమ్‌లో ఒక్కో సిట్టింగుకీ అయిదు రూపాయలిచ్చేవాళ్ళం. ఇప్పుడెం తిస్తున్నారేమిటి....." యథాలాపంగా అడిగాను.

"గంటకు నలభై అని ఫిక్స్ చేశాం"

'అయ్యో అంత తక్కువా. ఆరుగంటలు సమాధిలో ఉన్నట్టు కూర్చుంటే 240 రూపాయలొస్తాయి. రోజు కూలీ కన్నా తక్కువ! ఎంత దారుణం!

మనస్సు మూల్గింది.

"ఆమె తప్ప ఇంకెవరూ మోడళ్ళు లేరా?"

"ఒకరిద్దరొచ్చారుగాని గంటల తరబడి బిగుసుకుపోయి కూర్చోలేక పారిపోయారు. దాంతో ఆ లంబాడీ మహిళే మా సూపర్ మోడల్ అయిపోయింది" నవ్వారు ప్రిన్సిపాల్.

"ప్రాక్టికల్స్ టైంలో ఆమె టైమ్‌కి రాకపోతే ఎంత టెన్షన్ పడతామో చెప్పలేను. ఆమె క్యాంపస్‌లో కన్పిస్తే చాలు స్టూడెంట్స్‌కెంతో ధీమాగా ఉంటుంది. ఇప్పటికి ఎన్నో వేల చిత్రాలకు మోడల్‌గా పని చేసుంటుంది" అన్నాడో అధ్యాపకుడు.

"ఇది వరకు న్యూడ్, సెమిన్యూడ్ చిత్రాలు గీయడానికీ మోడల్‌గా వ్యవహరించిందిట కదా. పదేళ్ళ క్రితం న్యూడ్ పాఠ్యాంశాన్ని తొలగించేశారు" అన్నాడింకో అధ్యాపకుడు. అతడి మాటల్లో ఒకరకమైన బాధ, దుగ్ధ, నిరాశ ధ్వనించాయి!

"మీరు చదువుకునే రోజుల్లో ఎంత పొంకంగా బింకంగా వుండేదో మీ దగ్గరున్న ఫోటోని చూస్తోంటే తెలుస్తోంది" అన్నారింకొకరు.

తలాడిస్తూ అన్నాను "చాలా ఎట్రాక్టివ్‌గా ఉండేది. కాసంతా ఆమెని ఓ మోడల్ గానే చూసేవారు. ఆమె చిత్రాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లోని ఆర్ట్ గ్యాలరీల్లోనూ ఉన్నాయని గట్టిగా చెప్పగలను"

'అభిసారిక' చిత్రం గీస్తున్నప్పుడు నాలో తలెత్తిన యౌవనపు బుసబుసల్ని నెమరేసుకుని నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

అంతా నా వంక చిత్రంగా చూడటంతో సర్దుకూర్చుంటూ వాచీ వంక అసహనంగా చూశాను.

ప్యూను వచ్చి "రాలేద్సార్. రెండ్రోజుల్నుంచి రావట్లేదంట....." అని చెప్పాడు.

"అరె. ఆమెనెలాగైనా కలవాలనొచ్చానే. పోనీ ఆమె ఇంటి ఎడ్రస్సు కనుక్కుంటావా" ఆత్రపడ్డాను.

"మీకెందుకంత శ్రమ సార్. ఎవర్నైనా పంపి పిలిపిస్తాను......"

"తనకి మోడలింగే జీవనాధారం కదా. రెండు మూడు రోజుల్నుండి రావటం లేదంటే అనారోగ్యంగా ఉండి ఉంటుంది. ఎవర్నైనా తెలిసినవాళ్ళని పంపితే ఆమె ఇంటికెళ్ళి కలుస్తాను....."

కొన్ని కళ్ళు నా వంక అనుమానపు చూపులు సంధించాయి. దులిపేసుకున్నాను.

"ఒక ఐడియా ఉంది. ఒక చిత్రం గీయాలి. దానికి సరైన మోడల్ ఆమేనని నా నమ్మకం"

నా మాటలకు అందరూ అభినందన చూపులు కురిపించారు. ఎంతలో ఎంత మార్పు!

'ఆమె'ని అంతా మోడల్... మోడల్... అనే వ్యవహరిస్తున్నారు. ఆమె పేరెవరికీ తెలియకపోవడం నిజంగా చిత్రమే. ఆమె చిరునామా కాలేజీ రికార్డుల్లోనూ లేదు. మూడు దశాబ్దాలు పైబడి అదే కాలేజీలో ఓ భాగంగా ఉన్న ఆమె చిరునామా ఎవరికీ తెలీకపోవడం మరో చిత్రం!

యూజ్ అండ్ త్రో! ఇదే నేటి కల్చర్! ఎంత విషాదం!

ఎట్టకేలకు ఆమె ఇల్లు చూస్తానంటూ ఓ స్వీపర్ ముందుకొచ్చాడు.

అతడ్ని తీసుకుని నేనూ ఓ లెక్చరరూ ఆమె ఇల్లు వెదుక్కుంటూ వెళ్ళాం.

కారు ఆపి కాలి నడకన బస్తీ లోలోపలికెళ్ళాం. గుడిసెల్లాంటి ఇళ్ళు, దుర్గంధ పూరిత వాతావరణం, కిక్కిరిసిన జనం......

ఒక చిన్న గుడిసె ముందు జనం మూగి ఉన్నారు. మౌనంగా ఉన్నారు.

'ఇదే ఇల్లు'ంటూ చూపించాడు మాతో వచ్చిన స్వీపర్.

"ఏవయ్యింది" లెక్చరర్ ఒకర్నడిగాడు.

పైకిపోయిందని సైగ చేసాడతడు.

అమాంతం డీలా పడ్డాను. ఉస్సురని నిట్టూర్చాను. కొంచెం ముందు..... కనీసం కొన్ని గంటల ముందు వచ్చి ఉండి ఉంటే మరో కళాఖండం పురుడు పోసుకొనేది. ప్ఛ్.... బ్యాడ్‌లక్!

మేం లోపలికెళ్తామనుకుని కాబోలు ప్రక్కకి జరిగి దారిచ్చారంతా. మరి బాగోదనుకుని అయిష్టంగానే నేనూ లెక్చరరూ లోపలికెళ్ళాం.

'ఆమె' చనిపోయినట్లు లేదు. నిశ్చలంగా పడుకుని ఉన్న మోడల్లా ఉంది.

పై కప్పు కంతల్లోంచి వెలుగు లోపలికి త్రోసుకొస్తోంది. ఆమె మోములో ఏదో తెలీని నిర్లిప్తత, ముడతల్లో ఇంకేదో వేదాంతం – నన్ను కట్టి పడేసాయి.

అది ప్రశాంతతా లేక నిర్వేదమా లేక జీవన సమరం నుంచి విముక్త అవుతున్న భావనా లేక ఎదురు చూసి చూసి అలసి పోవటమా?

ఆమెలో ఆమె పడుకున్న తీరులో ఏదో గ్రేస్, మరేదో నిర్వికార ప్రశాంతత, ఇంకేదో అతీతభావన కన్పిస్తోంది !

జేమ్స్ కోరిక గుర్తొచ్చింది.

'చిలక ఎగిరిపోయింది' అనే శీర్షికతో నేనే ఈమె చిత్రం గీస్తే? గీస్తే కాదు గీయాలి – అన్న స్వార్థం నన్ను ప్రలోభ పెట్టింది.

గబుక్కున బయటికొచ్చి "శవాన్నింకా ఎంతసేపుంచుతారు?" అడిగాను.

"ఆమె మగాడు రావాల"

"ఎక్కడి కెళ్ళేడు ?"

"ఎప్పుడో ఇంకోదాన్ని తగులుకుని ఎళ్ళిపోనాడు"

"ఈమె ఇంకో పెళ్లి చేసుకోలేదా?"

"ఎవుర్నీ దగ్గరికి రానియ్యలే"

"అరె అలాగా. మరి పిల్లలూ లేరా?"

"వూహూ, ఒక్కతే వుంటాంది"

మరేమీ ఆలోచించకుండా లెక్చరర్ని తరిమి కాన్వాసు, స్టాండు, రంగులు తెప్పించాను. అంతా వింతగా చూస్తున్నారు. ఎవరి చూపుల్నీ కామెంట్లనూ లెక్కచేయకుండా చకచకా

చిత్ర యజ్ఞం ప్రారంభించి పూర్తి చేసాను. నా గుండెల్నిండా వెన్నెల వెలుగు పరచుకుంది. ఒక విజేతలా అనుభూతించాను.

అబ్బురపడ్డారంతా.

'అభిసారిక' చిత్రానికి డబ్బివ్వలేదన్న సంగతి గుర్తొచ్చింది. దానికీ దీనికీ కలిపి అన్నట్టుగా అయిందొందల నోటు ఆమె పక్కన పెట్టాను. ఆమె ఋణం తీర్చేసుకున్నట్టు తృప్తి పడ్డాను.

"తన ఆఖరి ఖర్చుకీ తనే సంపాయించుకుంది. ఇంక మొగుడోడు రాడు గానీ, ఏర్పాట్లు మొదలెట్టండి అవతల చీకటి పడిపోతాంది" ఒక పెద్దాయనన్నాడు.

ఎంత ఘోరం! వేల చిత్రాలకు శిల్పాలకూ స్ఫూర్తి అయిన ఆమె, లక్షలు విలువ చేసే చిత్రాలకు ముడిసరుకు అయిన ఆమె, మొగుడు వదిలేసి పోయినా నీతికి నిలబడ్డ ఆమె అంతిమయాత్రకు డబ్బు కరువయ్యింది!

నిట్టూర్చి నా సరంజామా తీసుకుని వచ్చేస్తోంటే కాలేజీ ప్యూన్ ఎదురయ్యాడు.

"మోడల్ కన్పించిందా సారూ"

"ఆఁ.... పోయాక కూడా మోడల్‌గా వ్యవహరించింది. షీ ఈజ్ గ్రేట్" ఒక గొప్ప చిత్రాన్ని గీయగలిగానన్న సంతృప్తి నన్ను ఊపేస్తోంది.

"మోడల్ పేరు కనుక్కున్నారా సారూ?"

అతడు మామూలుగానే అడిగాడు. కాని ఆ ప్రశ్న నా గుండెల్ని మెలి తిప్పింది. ఎంతో ఉన్నతుడ్నని ఫోజు కొట్టే నేను కూడా......?!

మాటలు రాని చిత్తరువునయ్యాను !

కథా నిలయం
శ్రీకాకుళం

(కథాకేళి, జనవరి 2014)